బట్టతల పొట్టి మనిషి

బొమ్మిడి అచ్చారావు

"ఈ రాత్రికి జయా బ్యాంకు మన టార్గెట్. రాత్రి ఒంటి గంటకు సరిగ్గా మనం బ్యాంకును కొల్లగొట్టాలి" అన్నాడు మహేంద్ర.

అతనికి నలభై ఏళ్ళుంటాయి. దుబ్బులాంటి జుట్టు, గడ్డం అతని ముఖానికి క్రూరత్వాన్ని తెచ్చిపెడుతున్నాయి. మీసాల్లేవు. ఎర్ర చింతనిప్పుల్లాంటి కళ్ళు చూసేవాళ్ళకు భయంగొలిపేలా వున్నాయి. ఎంతటి ఘాతుకాన్నయినా మంచినీళ్ళ ప్రాయంలాగా చేసేలా వున్నాయి అతని చేతులు.

అతని చుట్టూ ఓ ఎనిమిదిమంది అనుచరులున్నారు. వాళ్ళ అవతారాలు కూడా దాదాపు వాళ్ళ యజమానిలాగానే వున్నాయి. అందరి చేతుల్లోను తుపాకులున్నాయి. యజమాని నిప్పుల్లోకి దూకమన్నా అందులోయే ఒక్కడు వెనుదియ్యడు. సాహసం, దౌర్జన్యం, దుడుకుతనం వాళ్ళ స్వంతమనట్టు మొరటుగా వున్నారు.

తను నాయకుడు చెప్పినదానికి అందరు తలలూపారు.

మహేంద్ర ఓ పెద్ద కాగితాన్ని మడతవిప్పి పక్క నే వున్న టేబిల్ మీద పరిచాడు.

దాన్ని అనుచరులకి చూపించి, "ఇదిగో, యిది ఆబిడ్స్‌కు పోయే దారి. ఇది యిలా మహాబూబియా కాలేజి రోడ్. ఇదిగో బ్యాంక్ స్ట్రీటు. ఈ స్పాట్‌లో వుంది జయా బ్యాంకు. సరిగ్గా పన్నెండూనలభై నిమిషాలకు మన జీవ్‌లో బ్యాంక్‌కి పదిగజాల యివతల అందరం దిగిపోతాం! ఇద్దరు పోయి వెనకపాటున కొట్టి గూర్ఖాని స్పృహ తప్పించటమో, శాశ్వతంగా నోరు మూయించటమో చేస్తారు. తర్వాత మన పని అడ్డు లేకుండా జరిగిపోతుంది.

దొంగ పేరుతో ఆ కౌంటు తెరిచి, అప్పుడప్పుడు చెక్కులు వేశాను. యే సేఫ్ ఎక్కడుందో అంతా బాగా స్టడీ చేశాను. కళ్ళు మూసుకుని వాటి దగ్గరకు పోగలను. మనం లోపల ప్రవేశించిన పదినిమిషాల్లో మన పని పూర్తి కావాలి. అంతా చకచకా జరిగిపోవాలి....ఓ....కే!?" అన్నాడు.

అనుచరులు మౌనంగా తలలూపారు.

మహేంద్ర ప్లాన్ కాగితం మళ్ళీ చుట్టేసి, చేతో పట్టుకున్నాడు. "ఇంకా యెవరికైనా అనుమానాలున్నాయా? వుంటే యిప్పుడే క్లియర్ చేసుకోండి!" అన్నాడు.

"వేషాలు మార్చుకోవాలా, అక్కర్లేదా?" ఒక అనుచరుడు అడిగాడు.

"అక్కర్లేదు. మనం ఒరిజినల్‌గా వున్నామో, వేషాలు వేసుకున్నామో — యెవరికి కనిపిస్తాం గనకా?

వృథా ప్రయాసపడి టైం వేస్టుచేసుకోవద్దు."

"అలాగే!" అందరూ తలలూపారు.

* * *

రాత్రి పన్నెండు దాటి నలభై నిమిషాలయింది.

బ్యాంకి స్ట్రీటులోని జయా బ్యాంకుకి పదిగజాల దూరంలో ఓ జీపు ఆగింది. దానిలోనుంచి చకచక తొమ్మిదిమంది కిందికి దిగారు. అందరూ చకచక జయా బ్యాంకు దగ్గరకు పరుగులాంటి నడకతో చేరుకున్నారు.

గూర్ఖా అప్పటికే నేలకరుచుకుని వున్నాడు. అయితే గూర్ఖాను పడగొట్టడానికి ముందుగా వచ్చిన తమ వాళ్ళిద్దరూ కనిపించలేదు.

మహేంద్ర తనవాళ్ళకు సైగచేశాడు.

వాళ్ళు అతని వెనకనే బ్యాంక్ లోపలికి చేరుకున్నారు.

మహేంద్ర తాళాలగుత్తి ఒకటి పైకితీశాడు.

సరిగ్గా అదే సమయంలో "ఎవరూ కదలొద్దు, ప్రాణాలు పోతాయి!" అన్న హెచ్చరిక వినిపించి, అందరు గన్స్ చేతుల్లో తీసుకున్నారు.

"మిష్టర్ మహేంద్రా నీ వాళ్ళను దుడుకుగా ప్రవర్తించకూడదని చెప్పు. ప్రాణాలు తీయటానికి మా వాళ్ళు వెనకాడరు!" హెచ్చరిక మరోసారి వినిపించింది.

అది ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ గొంతని మహేంద్రకు తెలుసు. పోలీసులతో అకస్మాత్తుగా దాడిచేశాడు.

మహేంద్ర మెరుపువేగంతో వెనుతిరిగి శ్రీనివాస్ కి గన్ గురిచేసి అతని చేతిలోని రివాల్వర్ ఎగరగొట్టాడు. అయితే పోలీసులు వూరికే కూచోలేదు. మహేంద్ర

చేతిలోని గన్ గాల్లోకి ఎగిరగొట్టారు. అతని అనుచరు లిద్దర్ని గాయపరిచారు.

శ్రీనివాస్ చేతిలోకి మళ్ళీ రివాల్వర్ ప్రత్యక్ష మయింది.

సరాసరి మహేంద్రను గురిచేసి, "మిస్టర్ మహేంద్రా చివరిసారిగా చెప్తున్నాను. నీ మనుషులు వెంటనే ఆయుధాలతోబాటు మాకు సరెండార్ అయిపోండి! లేకుంటే అందర్నీ నిస్సంకోచంగా కాల్చేస్తాం!, మేజి స్ట్రేట్ నించి ఫైరింగ్ ఆర్డర్స్ తీసుకున్నాం. మీ ముఠా ఎక్కడ కనపడ్డా కాల్చెయ్యమని కమిషనర్, డి.జి.పి. నుంచి అందరు మాకు ఆదేశాలు స్పెషల్‌గా ఇచ్చారు!" అన్నాడు శ్రీనివాస్.

పోలీసులు వాళ్ళని గన్స్‌తో కవర్ చేస్తున్నారు.

ఓ అయిదు నిమిషాల తర్వాత మహేంద్రను, అతని తక్కిన అనుచరుల్ని తీసుకుని పోలీసు వేన్ విజయగర్వంతో స్టేషన్ వైపు సాగిపోయింది.

2

"మహేంద్రతో పాటు మరికొన్ని అలాంటి డెకాయిట్ ముఠాలు సిటీలో దోపిడీలు సాగిస్తున్నాయి. మహేంద్రని అతని అనుచరుల్ని బంధించిన మర్నాడే బాంకు స్ట్రీటు లోని లక్ష్మీ బ్యాంకుని దో చేశారు. అంతక్రితం యీ కేసు పరిశోధనకు వెళ్ళిన యిద్దరు పోలీసు ఆఫీసర్ల జాడ లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్—యెదురుగా కూచునివున్న డిటెక్టివ్ కిరణ్‌తో.

కిరణ్ శ్రీనివాస్ చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు.

"మహేంద్ర తేలికగా లొంగాడా?" అడిగాడు.

"ప్రతిఘటించాడు. అయినా చివరికి లొంగిపోయాడు.

అతని స్థావరం ముట్టడించి అక్కడి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాను — ఇంకో యిద్దరు అనుచరులు అక్కడ కూడా దొరికారు. వాళ్ళని అదుపులోకి తీసుకున్నాం!"

కిరణ్ తలూపాడు.

"ఈ దోపిడీలకు ఓ అంతర్జాతీయ ముఠా హస్తం వున్నదని స్పష్టమవుతోంది. మహేంద్రనుగాని అతని అనుచరుల్నిగాని యెంత అడిగినా నోరు మెదపటంలేదు. చాలా మొండివాళ్ళు!"

కిరణ్ మందహాసం చేశాడు.

శ్రీనివాస్ ఉడుక్కున్నట్టు చూసి "అప్పుడే అథారిటీస్ నుంచి వార్నింగ్స్ వచ్చాయి. త్వరలో యీ దోపిడీలకు కారణమయిన ముఠాల్ని పట్టి బంధించమని ఆదేశాలు వచ్చాయి. ఫెయిలయితే చాలా తీవ్రంగా వుంటాయి పనిష్మెంట్సు!" అన్నాడు.

"ఇంతకీ నా కెందుకు కబురుపెట్టి పిలిచావో చెప్పనే లేదు!"

"అదేమిటి బ్రదర్, నిన్ను పిలిపించాల్సి వచ్చిందంటే అర్థం పరిస్థితి మా చేయిదాటిపోయిందని! మా కంట్రోల్లో వున్నంతవరకూ ప్రయత్నించాం. కాని, యిక మావల్ల కాదని తేలిపోయింది. కమిషనర్ గారు, డి.ఐ.జి. నీకు కబురు చేయమన్నారు. నీతో నాకు సన్నిహిత సంబంధాలున్నాయని తెలిసి నన్నే కబురు పెట్టమన్నారు. నువ్వు రాగానే ఫోన్ చెయ్యమన్నారు. చెయ్యనా?"

కిరణ్ చేయి ఎత్తి వారించి, "వద్దు! నేనిప్పట్లో యీ కేసులో యెలాంటి సహాయమూ చెయ్యలేను!" అన్నాడు.

శ్రీనివాస్ విస్తుపోయి చూశాడు.

"అదేమిటి బ్రదర్, నీమీదే హోప్స్ అన్నీ పెట్టు కొని వున్నారు" అన్నాడు.

"సారీ, నాకు ఇంకో అర్జంటు కేసుంది. ఆ కేసు వివరాలు సేకరించటానికి ఢిల్లీ వెళుతున్నాను. మళ్ళీ తిరిగొచ్చాక నే యిక యే కేసయినా చూసేది!" కిరణ్ అన్నాడు.

శ్రీనివాస్ నిస్సహాయంగా చూశాడు.

"నేను వచ్చినవెంటనే కూడా మీ పనికి దిగటానికి అవుతుందో, లేదో! యెందుకంటే నేను వివరాలు సేకరించి వచ్చాక నా కేస్‌ని డిస్పోజ్ చెయ్యాలి కదా! అంతదాకా మీది టేకప్ చెయ్యలేను!"

శ్రీనివాస్ యిబ్బందిగా చూశాడు.

కిరణ్ చెప్పేదేం లేదన్నట్టు లేచి నిలబడ్డాడు.

"మళ్ళీ యెప్పుడొస్తున్నావు?" అడిగాడు శ్రీనివాస్.

"బహుశా ఓ వారం పట్టొచ్చు!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ కిరణ్‌ని స్టేషన్ బయటివరకు సాగనంపాడు. కిరణ్ టయోటా స్టార్టుచేసేవరకు శ్రీనివాస్ కిరణ్ దగ్గరే నిల్చుని వున్నాడు.

కిరణ్ సెలవు తీసుకుంటున్నట్టు చేయి ఊపాడు. టయోటా వెళ్ళిపోయింది!

ఆ మర్నాడు అన్ని పేపర్లలోను సంచలనం కలిగించిన వార్త!

మహేంద్ర జైలునుంచి తప్పించుకు పారిపోయాడు!

3

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ మహేంద్రా!"

మహేంద్ర తలతిప్పి చూశాడు. యెదురుగా వున్న

వ్యక్తి స్నేహపూర్వకంగా నవ్వుతున్నాడు.

"నీవు తెలివైనవాడనుకుంటాను. ఈ పావరం పోలీసులు వల పరచుకున్నారు. నువ్విక్కడికి వస్తావని తెలిసి నేను యిక్కడే కాచుకుని వున్నాను. కమాన్ అదిగో నా కారు! బాస్ దగ్గరికెళ్దామా?" అన్నాడా వ్యక్తి పైపు పీలుస్తూ మహేంద్ర వంక స్నేహ పురస్సరంగా చేయి చాపి.

మహేంద్ర అతనితో కరచాలనం చేశాడు.

"ఆల్ రైట్, పోదాం!" అన్నాడు మహేంద్ర.

ఆ వ్యక్తి కారువైపు నడుస్తూ సిగరెట్ పెట్టెతీసి మహేంద్రకు ఆఫర్ చేశాడు. మహేంద్ర ఓ సిగరెట్ తీసుకుని సిగరెట్ అతనికిచ్చేశాడు.

"ఏమిటి డల్ గా వున్నావు? రెండ్రోజులు జైల్లో వుండగానే వేదాంతిలా తయారయ్యావే?" అన్నాడతను.

మహేంద్ర నవ్వి, "అదేం కాదు, పద!" అన్నాడు.

అతను డ్రయివింగ్ సీటు తలుపు తెరిచి కూచున్నాడు. అతని పక్క సీట్లో మహేంద్ర కూచున్నాడు. కారు కదిలింది.

"నేనొస్తున్నట్టు బాస్ కి తెలుసా?"

"ఉదయం పేపరు చూసేవరకు యెవరమూ అనుకోలేదు. పేపర్లో నువు తప్పించుకున్న వార్త ప్రముఖంగా ప్రచురించారు. అది చూడగానే బాస్ నన్ను నీ దగ్గరకు వెళ్ళమన్నారు. అయితే నువ్వు ఎక్కడుంటావో అంచనా కట్టడం కష్టమయింది. యెక్కడున్నా నీవుండే స్థావరాని కొస్తావని తెలుసు? అందుకే కారుతోబాటు అక్కడ వెయిట్ చేస్తున్నాను" అన్నాడతను.

"థాంక్స్!" అన్నాడు మహేంద్ర.

కారు చిన్న జర్క్‌తో ఆగింది.

మహేంద్ర ముందుకు చూశాడు. ఊరి పొలిమేరలు దాటి చాలా దూరం వచ్చేశారు.

అక్కడ కొండలబారు వున్నది. చాలా యెత్తయిన కొండలు బాగా విస్తరించి వున్నాయక్కడ.

కారు దిగారిద్దరు. కొండలబారువంక నడిచారు.

పైకి కొండలు మాదిరి కనిపించినా దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ బిలమార్గాలు కనిపించాయి.

అతను ఓ బిలం దగ్గర నిలబడి చేత్తో కుడిపక్కన నేలమీద తడిమాడు.

అంతే! సారంగం బయటపడింది. అంతవరకు అడ్డుగా వున్న బండరాయి పలక పక్కకి జరిగింది.

మహేంద్ర మౌనంగా అతన్ననుసరించాడు.

సారంగం లోపలకు ప్రవేశించి మళ్ళీ లోపల ఏదో మీట నొక్కాడతను. బండరాయి మామూలుగా బిలానికి అడ్డుగా మూసుకుపోయింది.

ఇద్దరు లోపల కొంతదూరం నడిచాక ఓ సమతల ప్రదేశం చేరారు. అక్కడ కాగడాల వెలుతురులో కొందరు వ్యక్తులు నిల్చుని వుండటం, అక్కడ ఓ యెత్తయిన బండరాయిమీద కూచుని మరో వ్యక్తి తన యెదుట నిల్చున్న వాళ్ళకు ఏవో సూచనలిస్తున్నాడు.

"వెల్‌కం మహేంద్రా! నువ్వు తప్పించుకొస్తావని నాకు తెలుసు. గుడ్ అడ్వెంచర్!" అన్నాడు ఆ వ్యక్తి.

"మనం అనుకున్నట్టే తన స్థావరం వద్దనే కనిపించాడు సార్! వెంటనే కారులో తీసుకొచ్చాను" అన్నాడు మహేంద్రతో వచ్చిన వ్యక్తి.

"గుడ్ మిస్టర్ ప్రకాష్. నువ్వు వెళ్ళొచ్చు. అయితే యీ రాత్రికి యే స్పాట్ యెన్నుకోవాలో చెప్పాను కదా!"

"చెప్పారు బాస్! ఈ రోజు వేటలో మిస్టర్ జస్వంత్ సహాయం కూడా తీసుకోమన్నారు!"

"జస్వంత్ అక్కర్లేదు, మహేంద్ర వచ్చేశాడుకదా! అతన్ని సాయం తీసుకువెళ్ళు. నీ ఫాలోయర్స్ ఎలాగూ వున్నారుకదా!"

"అలాగే సార్, జస్వంత్‌కి కబురు చేస్తాను."

"నేను వైర్‌లెస్ మెసేజ్ యిస్తాను. మళ్ళీ నువ్వు వెళ్ళటం దేనికి? అదీగాకుండా మనవాళ్ళు మకాముంటున్న రహస్య ప్రాకారాలకి తరచు వెళ్ళటం మంచిది కాదు! బయటి వాళ్ళుగాని, పోలీసులుగాని పసిగట్టారంటే ప్రమాదం! అందుకే మహేంద్ర ప్రాకారం మనం యికమీదట ఉపయోగించకూడదని నిర్ణయించుకున్నాం. అది పోలీసులకి తెలిసిపోయింది!"

"అవును బాస్! వాళ్ళకి ప్రాకారం తెలిసిపోవటమే కాదు. జయా బ్యాంకును లూటీ చేయబోతున్నట్టు ముందే తెలిసిపోయింది. అందుకే వాళ్ళు మాకన్న ముందు బ్యాంకు దగ్గర మాటువేసి మమ్మల్ని బంధించేశారు" అన్నాడు మంహేంద్ర.

"అంటే మీరు బ్యాంకు దోపిడికి ప్లాన్ చేస్తున్న సమయంలో యెవడో పోలీసుల తాలూకు మనిషి వినయినా వుండాలి. లేదా నీ ఫాలోయర్స్ యెవరైనా వాళ్ళకు ఉప్పరించి వుండాలి! నీ అనుచరులంతా నమ్మకస్తులేనా?"

"చాలా నమ్మకమైనవాళ్ళు బాస్! జైల్లో ఎన్ని చిత్ర

హింసలు పెట్టినా మన తక్కిన స్థావరాల గురించిగాని, ముఠాల గురించిగాని, యేమాత్రం లీక్ చేయలేదు!"

"జైల్లో నిన్ను ఏమైనా అడిగారా? ఎలా తప్పించుకు రాగలిగావు? నువ్వొచ్చేశాక పోలీసులు మనవాళ్ళనుంచి రహస్యాలు కక్కిస్తారేమో!" బాస్ అనుమానం వెలిబుచ్చాడు.

"మనవాళ్ళు అవసరమైతే ప్రాణాలు త్యాగం చేస్తారే గాని యేమాత్రం రహస్యాలు బయటపెట్టరు బాస్! ఆ ధైర్యం నాకుంది! నన్ను చాలా రకాలుగా హింసించారు. అయినా నేను బయటకు చిన్న రహస్యం కూడా లీకివ్వలేదు! రాత్రి సెంట్రీని పట్టుకుని వాడికి నేను కట్టుకున్న బంగారు మొలత్రాడు యిచ్చేశాను. అంతే వాడు నేను సెల్ నించి బయటపడి గోడదుమికేవరకు చూసీ చూడనట్టు వదిలేశాడు. నాతో బాటు మనవాళ్ళని కూడా తప్పించాలనుకున్నాను—కాని గోలయిపోతుందని ఆ సాహసం చెయ్యలేదు!" అన్నాడు మహేంద్ర.

"గుడ్! మనవాళ్ళకి బయటకి రప్పించే ప్రయత్నాలు చేద్దాం. నీకు సాయంచేసిన సెంట్రీ యెక్కడ వుంటాడో వివరాలు సేకరించావా?"

"ఆఁ! చంచల్ గుడాలోనే క్వార్టర్సులో వుంటున్నానని చెప్పాడు. అవసరమైతే యెలాంటి సాయమైనా చేస్తానన్నాడు."

"గుడ్! పోలీసుల్లో ఇలాంటి లంచగొండులున్నంత కాలం మనలాంటి డెకాయిట్స్ కేం భయంలేదు. చక్కగా తప్పించుకోవచ్చు. సరే, యీ రోజు జస్వంత్ వేరే పని మీద పోతాడుగాని నువ్వు ప్రకాష్ కి సాయంగా వెళ్ళు. జాగ్రత్త, ఓ పక్క నీకోసం పోలీసులు గాలిస్తూనే

వుంటారు" అన్నాడు బాస్.

మహేంద్ర, ప్రకాష్ బాస్ దగ్గర సెలవుతీసుకుని బయటికొచ్చారు. మీటలు నొక్కి బండరాయి పలకను తెరిచి మళ్ళీ మూసేశాడు ప్రకాష్.

"ఈ రోజు యే బ్యాంక్ ప్లాన్ చేశారు?" అడిగాడు మహేంద్ర.

"బ్యాంక్ కాదు! శేఠ్ చున్నీలాల్ నగల దుకాణం! చాలా జ్యూయెల్రీ వుందతని షాపులో. ఆ షాపుకి లాకింగ్ సిస్టమ్ చాలా పకడ్బందీగా వుంది. యేసిడ్స్ ఉపయోగించి తలుపులు తెరవటానికి అంతా ప్లాన్ చేశాం! నేను, జస్వంత్ వెళ్ళాలనుకున్నాం. నువ్వొచ్చావు కదా అని బాస్ నీకు అప్పగించాడు జస్వంత్ బాధ్యత!"

ఇద్దరు కారు దగ్గర కొచ్చారు.

"కారిలా రోడ్డుపక్కన వదిలి వచ్చావు కదా, పబ్లిక్ గాని పోలీస్‌కిగాని అనుమానం రాదా?"

"వస్తే రానివ్వు! కారు మనది కాదుగదా!"

"అంటే....?"

"ఇందాకా నీకోసమని దీన్ని రెడీమేడ్‌గా కోఠీ సెంటర్‌లో పార్కు చేసి వుంటే వేసుకొచ్చాను. దాని ఓనర్ పోలీసు రిపోర్టిచ్చి వాళ్ళు రంగంలోకి వచ్చి వుంటే దీన్ని యెవడో యిక్కడ వదిలేసి వుంటాడని తీసుకుపోతారు, లేకుంటే మనకు ఉపయోగపడుంది మరి కాసేపు. ఇప్పుడు దీని పనిలేదు మనకి! ఇక్కడే వదిలేసి పోతాం!"

"మన బాస్ స్థావరానికి దగ్గరలో వదిలే పోలీసులకి కోరి మన యిన్ఫర్మేషన్ యిస్తున్నట్టు కాదా?" అడిగాడు మహేంద్ర.

"చూశావు కదా బాస్ వుంటున్న స్థలం యెంత పకడ్బందీగా యేర్పాటయిందో! మనం వచ్చిన దారికాక, యెమర్జన్సీలో తప్పించుకు పోవటానికి మరో అండర్ గ్రౌండుంది లోపల. అక్కడ ఎలక్ట్రానిక్ యెక్విప్‌మెంట్ అంతా వుంది! అక్కడికి బాస్, ఒకరిద్దరు ముఖ్య అనుచరులుతప్ప యింకెవరూ వెళ్ళటానికి అనుమతి లేదు! అందుకే యెవరికి వాటి విషయం పూర్తిగా తెలీదు!"

"పోనీ ఈ కారుని సిటీకి బాగా దూరంగా వదిలేద్దాం యెందుకైనా మంచిది!"

"సరే. అలాగే పద!"

4

కూకట్‌పల్లి చేరాక "కహాఁరుక్‌నా సాబ్?" అనడిగాడు టాక్సీ డ్రయివర్.

"ఇదరీ రుకో!" అన్నాడు ప్రకాష్.

టాక్సీకి ఫేర్ చెల్లించాడు ప్రకాష్. ఇద్దరు రోడ్‌న నడుస్తున్నారు. కూకట్‌పల్లి కాలనీ దాటాడు. హౌసింగ్‌బోర్డు కడుతున్న యిళ్ళ కాలనీ కూడా దాటేశారు.

ప్రకాష్ చుట్టూ పరీక్షగా చూశాడు. ఎవరూ తమని గమనించటంలేదని నిర్ధారణ చేసుకున్నాడు.

మరికొంతదూరం నడిచారిద్దరూ.

అక్కడ నిర్మానుష్యంగా వుంది. అన్నీ కొండలు, బండరాళ్ళు. రోడ్డు వదిలి బండలవైపు నడిచాడు ప్రకాష్. మహేంద్ర అనుసరిస్తున్నాడు.

"మనతో బాటు ఆరుగురు అనుచరులున్నారు. అందరూ బాగా అనుభవమున్నవాళ్ళే! సరిగ్గా ఒంటి

గంటన్నరకు వాళ్ళు ఆ ఏరియాలో గస్తి తిరిగే గూర్ఖాను ఉదయంవరకు లేవకుండా చేస్తారు. అప్పుడూ అప్పుడూ యిద్దరు బీట్ కాన్‌స్టేబుల్స్ నైట్ పెట్రోలింగ్‌కని నియమించబడుంటారు. వాళ్ళు చాయ్‌లు తాగుతూ యెక్కడో బాతాఖానీ కొడ్తుంటారు.

శేఠ్ చున్నీలాల్ షాపు రోడ్డు చివరి మలుపులో వుంది. మనం చేసే పని రోడ్డున పోయేవాళ్ళకు కనబడే అవకాశంలేదు! అదీగాక రాత్రి పన్నెండు తర్వాత యెవరూ రోడ్డున నడవటానికి రూల్సు ఒప్పుకోవు. కాబట్టి మనను యీ హైదరాబాదు నగరంలో రాత్రి పన్నెండు తర్వాత అడిగే నాథుడులేడు! మనదే రాజ్యం!" నవ్వాడు ప్రకాష్.

మహేంద్ర తనూ నవ్వి, "ఈ నగరం పదికాలాల పాటు యిలాగే వర్ధిల్లాలని కోరుకుంటున్నాను!" అన్నాడు.

ప్రకాష్ పెద్ద బండరాళ్ళున్న గుట్ట దగ్గర ఆగాడు.

అక్కడ ఆరుగురు వ్యక్తులు రాళ్ళు కొడుతున్నారు.

ప్రకాష్‌ని చూసీ కూడా చూడనట్టు తమ పనిలో నిమగ్నయిపోయి వున్నారు వాళ్ళు!

ప్రకాష్ వాళ్ళను చూపించి, "వీళ్ళే మన అను చరులు!" అన్నాడు.

"ఇదేమిటి?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇది పగటి వేషం! మనకి ప్రత్యేకం యిక్కడ రహస్య స్థావరమంటూ ఏం లేదు. పగలంతా వీళ్ళు యిక్కడ రాళ్ళుకొట్టే కూలీలు. చీకటిపడ్డాక రాజ్యమేలే రారాజులు!" నవ్వుతూ అన్నాడు ప్రకాష్.

"మరి ఆయుధాలు ఎక్కడ దాస్తారు? పగలెవరైనా

చూసి అనుమానిస్తే కష్టంకదా?" అన్నాడు మహేంద్ర.

"అదిగో ఆ రాళ్ళు కొట్టి కుప్పలు పోస్తున్నారే, అవే ఆయుధాగారాలు! ఆ రాళ్ళగుట్టల అడుగున మన వాళ్ళకు కావలసిన రైఫిల్సు, బుల్లెట్సు, నాటుబాంబులు వగయిరా అన్నీ సంతృప్తిగా వుంటాయి. యెలా వుంది మన ప్లాన్?"

"చాలా బావుంది."

"ఇదివరలో నువ్వు యిక్కడికి రాలేదు గాబట్టి నీకివన్నీ కొత్తగా వున్నాయి. నా బెటాలియాన్‌ని 'ఓపెన్ ఎయిర్ సోల్జర్సు' అని మనవాళ్ళు సరదాగా పిలుస్తుంటారు....ప్రతి ఏజెంటుకు అండర్ గ్రౌండ్ స్థావరాలు కష్టం కదా! అంచేత నేనే బాస్‌కి చెప్పి యిలా మేనేజ్ చేస్తున్నాను నా గ్రూప్‌ని.

చీకటి పడుతోంది. రాళ్ళు కొడుతున్న వ్యక్తులు లేచి గుట్టల వెనక్కు వెళ్ళి దాచిన గుడ్డలు వేసుకుని వచ్చారు. అంతవరకు కూలీల్లా వున్న మనుషులు ఒక్కసారి కులీనులయిపోయారు. షర్టులు, పేంటులు, మఫ్లర్లు వేసుకున్నారు. ప్రకాష్ దగ్గరగా వచ్చారు.

"ఈయన మరో యేజెంటు మహేంద్ర! నాలాంటి ఏజంట్ అన్నమాట! మీలో ఎవరైనా ఈయన్ని చూసి వుండొచ్చు యిదివరకు. అవునా?" అన్నాడు ప్రకాశ్ తన వాళ్ళకు మహేంద్రను చూపుతూ.

"మహేంద్రాజీ తెలియక పోవటమేమిటి? వారం రోజులక్రితం బాస్ జరిపిన జనరల్ బాడీ సమావేశంలో ఏజెంట్సందర్నీ పరిచయం చేశారు కదా!" అన్నారు వాళ్ళు.

"మరి వీళ్ళకి భోజన సదుపాయాలు?" సందేహం వెలిబుచ్చాడు మహేంద్ర.

"సారికి యిద్దరు చొప్పున యెర్రగడ్డపోయి హోటల్స్లో తిని తాగొస్తారు. తక్కిన వాళ్ళు యిక్కడ ఆయుధాగారానికి కాపలా....!" అని ప్రకాష్ చెప్తుండగానే రాళ్ళగుట్ట వెనకనించి బీప్....బీప్....అంటున్న శబ్దం వినిపించింది.

ప్రకాష్ రెండంగల్లో రాళ్ళగుట్ట వెనక్కి పరుగెత్తుకు వెళ్ళి రెండు నిమిషాల తర్వాత వచ్చాడు.

మహేంద్ర ప్రశ్నార్థకంగా చూశాడతనివంక.

"బాస్నించి మెసేజ్ వచ్చింది. అంతా సవ్యంగా వుందని, ఈ రోజు పాత బస్తీలో కర్ఫ్యూ మూలంగా పోలీసులు ఎక్కువమంది అక్కడే డ్యూటీమీద వుంటారని, లైన్ క్లియర్ గా వుంటుందనీ చెప్పాడు. మనల్ని ప్రిపరేషన్లో వుండమన్నాడు!"

మహేంద్ర తలాడించాడు.

"సో, మనిద్దరం పోయి భోంచేసివద్దామా, లేక మన వాళ్ళచేత బిరియానీ పాకెట్సు పట్టించుకురమ్మని చెప్పదామా?" అన్నాడు ప్రకాష్.

మహేంద్ర నవ్వి, "వైన్ కూడా!" అన్నాడు.

ప్రకాష్ తనూ నవ్వి, "అది లేకుండా ఎలా?" అన్నాడు.

5

రాత్రి పన్నెండు దాటింది.

"లెటజ్ స్టార్ట్" అన్నాడు ప్రకాష్. అతని మాట బాగా ముద్దగా వస్తోంది. విస్కీ మోతాదుమించి తాగటంతో మత్తుగా వాలిపోతున్నాయి కళ్ళు.

మహేంద్ర పరిస్థితి కూడా దాదాపు అలాగే వుంది. కావలసిన సరంజామాతో అనుచరులు కదిలారు. ప్రకాష్,

మహేంద్ర, ఆరుగురు అనుచరులు రోడ్ మీద కొచ్చారు.

"ఈ రాత్రిపూట మనకు కన్వేయన్స్ యెలా దొరుకుతుంది?" అన్నాడు మహేంద్ర.

ప్రకాష్ అతనివైపు చిత్రంగా చూసి, "మీరు మొన్న దేన్లో వెళ్ళారు బ్యాంక్ కి?" అన్నాడు.

"జీప్ లో!" అన్నాడు మహేంద్ర. "మేం లొంగిపోయాక, ఆ జీప్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు."

"ఇప్పుడు మనకోసం మన కంపెనీ వేన్ వస్తుంది!" అన్నాడు ప్రకాష్ చిన్నగా నవ్వి.

సరిగ్గా అదే సమయంలో తెల్లటి స్టాండర్డ్ వేన్ వచ్చి వాళ్ళ ముందాగింది.

ప్రకాష్ డ్రయివర్ సీట్లోని వ్యక్తివంక చూసి "వెన్నెల చాలా చల్లగా వుంది!" అన్నాడు.

"రెండు రోజులుగా యిలాగే వుంది!" అన్నాడు డ్రయివర్.

అవి వాళ్ళ కోడ్ వర్డ్స్

ప్రకాష్, మహేంద్రతో డ్రయివర్ పక్కన యెక్కి కూచున్నాడు. అనుచరులంతా బాడీలో కూచున్నారు. వెంటనే వేన్ పరుగుతీసింది.

శేఠ్ చున్నీలాల్ షాపుకి యిరవై గజాల దూరంలో వేన్ ఆప్ చేశారు.

ముందుగా ఓ అనుచరుడు ఏసిడ్స్, తాళాలగుత్తి తీసుకుని దిగి, చున్నీలాల్ షాపు దగ్గరకు వెళ్ళాడు. ఈ లోపల మరో అనుచరుడు వీధి చివరకు వెళ్ళి వచ్చాడు.

"గూర్ఖా వస్తున్నాడు" అన్నాడు గుసగుసగా.

ఈలోపల షాపు దగ్గరకు వెళ్ళిన వ్యక్తి చకచక ఏసిడ్స్ పోసి మారుతాళంచెవులతో తాళాలు తెరిచాడు.

వైండింగ్ స్టీల్ డోర్ని పైకి లేపాడు. గూర్ఖా అది చూసి అటు పరుగెత్తేటంతలో తక్కిన అనుచరులు వేన్ నుంచి దూకి గూర్ఖాను వెనకనుంచి పట్టుకున్నారు. ఏదో వాసన చూపించారు.

గూర్ఖా నేలమీదికి జారిపోయాడు.

ముగ్గురు అనుచరులు డోర్ని పైకి తోసేశారు.

ప్రకాష్, మహేంద్ర వేన్ దిగారు. వాళ్ళిద్దరి చేతుల్లోను రివాల్వర్లున్నాయి. అనుచరుల చేతుల్లో గన్స్ వున్నాయి.

ఇద్దరు అనుచరులు గుమ్మం దగ్గర వేటకుక్కల్లా కాపలా వున్నారు. డ్రయివర్ వేన్ లోనుంచి అందర్నీ పరీక్షగా చూస్తున్నాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. యే విధమైన వాహనాలు కూడా తిరగటంలేదు.

సరిగ్గా అదే సమయంలో పోలీసు వేన్, జీపు రెండు మోటారుబైకులు పెద్ద చప్పుడు చేసుకుంటూ వచ్చేశాయి. పోలీసులు గన్స్తో బిలబిలమంటూ దిగిపోయారు.

ముందుగా ప్రమాదాన్ని గుర్తించిన వేన్ డ్రయివర్ సైరన్ లాంటి హారన్ బొయ్యమనిపించాడు. ఒక్కసారిగా షాపునుంచి అందరు బయటికి పరుగెత్తుకొచ్చేశారు.

ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మోటర్బైక్ దిగి, "ఎవరూ పారిపోవాలని ప్రయత్నించవద్దు! మర్యాదగా లొంగిపోండి!" అంటూ అరిచాడు.

ప్రకాష్ చేతిలోని రివాల్వర్ గర్జించింది.

శ్రీనివాస్ చేతిలోని రివాల్వర్ ఎగిరి అవతలపడింది. అప్పటికే ఇన్స్పెక్టర్ కైలాష్ ప్రమాదాన్ని గుర్తించి ప్రకాష్ చేతికి గురిచూసి కాల్చాడు.

ప్రకాష్ నెత్తురు కారుతున్న చేతిని పట్టుకుని ఒక్క

పరుగున వేన్ వైపు తప్పించుకోవాలని ప్రయత్నించాడు. కాని అతని తొడలోనుంచి మరో బుల్లెట్ దూసుకు పోయింది కైలాష్ రివాల్వర్ నుంచి.

ఈలోపల ఆరుగురు అనుచరులు పోలీసులమీద కాల్పులు జరిపారు. ముగ్గురు కానిస్టేబుల్స్ నేలవాలి పోయారు. ఆ దేశమయంలో యిద్దరు అనుచరులు కూడా నేల కూలిపోయారు.

తక్కిన నలుగుర్ని పోలీసులు పట్టేశారు.

మహేంద్ర ఈలోపల తప్పించుకుని వేన్ దగ్గరకు పరుగుతుకుపోయాడు.

శ్రీనివాస్ మహేంద్రను గుర్తించి, "వాడే తప్పించుకుపోయిన డెకాయిట్ మహేంద్ర! వేన్‌లో పారిపోతున్నాడు పట్టుకో కైలాష్!" అని అరిచాడు, ఇన్స్పెక్టర్ కైలాష్ వంక తిరిగి.

కాని అప్పటికే వేన్ స్టార్టయి సర్రున ముందుకు పోయింది. దాన్నందుకోవాలనే ప్రకాష్ ప్రయత్నం ఫలించలేదు. నలుగురు అనుచరులతోను, పోలీసులకి బందీగా చిక్కిపోయాడు.

శ్రీనివాస్, తక్కిన సిబ్బంది వాళ్ళ అయిదుగుర్నీ పోలీస్ వాన్ వైపు నడిపిస్తున్న సమయంలో కిందపడున్న శ్రీనివాస్ రివాల్వర్ రెప్పపాటులో అందుకుని కాల్చుకున్నాడు ప్రకాష్.

మరుక్షణంలో పోలీసుల చేతుల్లో అతని శరీరం నిర్జీవంగా వేలాడింది.

పదినిమిషాల తర్వాత కైలాష్ మోటార్ బైక్ మీద తిరిగొచ్చి, "తప్పించుకు పోయాడు రాస్కెల్!" అన్నాడు.

"గాయాలు తగిలిన ముగ్గురు కానిస్టేబుల్స్ని వెంటనే హాస్పిటల్‌కి తరలించు. అలాగే ఆ యిద్దరు అనుచరుల్నీ కూడా!" అన్నాడు శ్రీనివాస్ కైలాష్ నుద్దేశించి.

ఇంతలో సార్జెంట్ శివం "సార్, మనవాళ్ళు ఇద్దరు, వాళ్ళ మనిషి ఒకడూ చనిపోయారు!" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కైలాష్ హేట్స్‌తీసి చేతుల్లో పట్టుకుని నిలుచుండిపోయారు కాసేపు.

6

"డిసీజ్ సెకండ్ ఫెయిల్యూర్!" అంటూ మండి పడ్డాడు బాస్ మహేంద్రమీద.

"ఏం చెయ్యమంటారు బాస్? నేనైతే రెండుసార్లు తప్పించుకు రాగలిగాను. కాని ప్రకాష్‌గాని, మన ఫాలోవర్స్‌గానీ ఎస్కేప్ కాలేకపోయారు. అయామ్ సారీ! రెండుసార్లూ మనవాళ్ళు దొరికిపోయారు" అన్నాడు మహేంద్ర.

పోలీసులబారినుంచి తప్పించుకుని సరాసరి బాస్‌ను చేరుకుని జరిగిన సంగతి వివరంగా చెప్పాడు మహేంద్ర.

వేన్ డ్రయివర్ "మహేంద్రాజీ తప్పేంలేదు బాస్! ఆయనకూడా వాళ్ళకి దొరికిపోతే, నేనుకూడా తప్పించుకు రాలేకపోయేవాణ్ని! నానుంచి స్టీరింగ్ తనే తీసుకుని ధైర్యంగా డ్రయివ్ చేసుకుని వచ్చాడు మహేంద్ర" అని చెప్పాడు.

బాస్ కొంత శాంతించినా చిందులు వేయటం మాన లేదు. "మనం యింత పకడ్బందీగా రైడ్స్ చేసినా యీ విషయం పోలీసులకి ఎలా తెలిసిపోయింది? రెండు సంద ర్భాల్లోనూ కూడా వాళ్ళు సమయానికి ఎలా రాగలిగారు?

నాకు చాలా డేంజర్ గా వుంది. మనవాళ్ళల్లోనే ఎవరో పోలీసుల తోడుగా పనిచేస్తున్నారేమోనని అనుమానం కూడా కలుగుతోంది! అది యెవరో తెల్సుకోవాల్సి వుంది!" అన్నాడు.

మహేంద్ర తలూపి, "కావటానికవకాశముంది బాస్!" అన్నాడు.

"మన బెటాలియన్స్ రెండు దొరికిపోయాయి పోలీసులకి. ఇక జస్వంత్ గ్రూపు, లతీఫ్ గ్రూపు మాత్రం మిగిలాయి. ఇన్ని దోపిడీలు యెంతో విజయవంతంగా జరిపిన మన సంస్థ ఘోరమైన యెదురు దెబ్బలు అప్పుడే రెండు రుచి చూసింది. రేపు ఫైనల్ ట్రయల్! ఇది విజయవంతం కాని పక్షంలో మనం హైదరాబాదు వదిలేసి మరో నగరం చూసుకోవటం చాలా ఉత్తమం!" అన్నాడు బాస్.

"మరి మన ఎక్విప్ మెంటు, వైర్ లెస్ ఆపరేటస్ ఎలక్ట్రానిక్ ఆపరేటస్ యిదంతా....?" అర్థోక్తిలో ఆగిపోయాడు మహేంద్ర.

"వెళ్ళిపోయే ముందు నాశనం చేసేసి వెళ్దాం. ఒకప్పుడు మనం యిక్కడ స్థావరమేర్పరుచుకున్న విషయం ఎవరికీ తెలియకూడదు. రూపురేఖలే లేకుండా చేసిపోదాం!" అన్నాడు బాస్.

మహేంద్ర తలూపాడు.

"మిష్టర్ మహేంద్ర, నువ్వు రేపు జస్వంత్ తో కలిసి పని చెయ్యాల్సి వుంటుంది. ఎక్కడ యేం చెయ్యాల్సిందీ అతను నీతో చెపుతాడు. ఉదయం మన వేన్ లోపోయి అతన్ని కలుసుకో! నే నీలోపల అతనికి మెసేజ్ పంపుతాను. టేక్ రెస్ట్ ఫర్ దిస్ నైట్ హియర్!" అన్నాడు

బాస్.

బాస్ అండర్ గ్రౌండుకి వెళ్ళిపోయాడు. మహేంద్రకు అక్కడే వసతి ఏర్పాటు చేయబడింది.

మహేంద్ర నిద్రపపక్రమిస్తూ ఎలక్ట్రానిక్ వాచీలోకి చూశాడు. మూడు గంటలు కావస్తోంది.

ఓ అరగంట తర్వాత లేచి కూచున్నాడు మహేంద్ర.

చుట్టూ దాదాపు పదిహేనుమంది అనుచరులు నిద్ర పోతున్నారు. ఇద్దరుమాత్రం సొరంగ ద్వారం దగ్గర వేటకుక్కల్లా కాచుకుని వున్నారు.

మహేంద్రకు బాస్ అండర్ గ్రౌండులో యేముందో చూడాలనిపించింది. చప్పుడు చెయ్యకుండా లేచాడు. సొరంగం దగ్గర కాపలా అనుచరులు మహేంద్రకు కని పించటంలేదు.

మహేంద్ర యిందాక బాస్ వెళ్ళిన దారి గుర్తు పెట్టుకుని అటు వెళ్ళాడు. సొరంగం ఇరుగ్గా వున్నచోట ఆగాడు. సొరంగం గోడలకి యేవో స్విచ్‌లున్నాయి. వాటిని తడిమాడు. ఓ చోట గుండ్రంగా వున్న బిలం యేర్పడి, కిందికి మెట్లు కనిపించాయి. సన్నటి వెలుగు మెట్లు దిగడానికి వీలుగా వున్నట్టు మెట్లమీద పడు తోంది.

ఎక్కడ్నుంచో పెద్దగా యింజను శబ్దం వినిపిస్తోంది. అది జనరేటర్ శబ్దమని మహేంద్ర గ్రహించాడు. మెట్లు దిగాడు.

అది ఓ పెద్ద హాలులా వుంది. ఆ హాలునిండా టెలి విజన్ సెట్లవంటి సెట్లున్నాయి. స్క్రీన్ మీద యేవో తరంగాల మాదిరిగా గీతలు వస్తున్నాయి పోతున్నాయి. మూడు సెట్స్‌న్నాయి, వాటిముందు ముగ్గురు వ్యక్తులు

కూచుని వున్నారు.

ఆ పక్కనే నాలుగైదు బల్లలమీదున్న సెట్సు వైర్‌లెస్‌కి సంబంధించినవని చూడగానే గ్రహించాడు మహేంద్ర. శబ్దం కాకుండా గోడని అనుకునే ముందుకి జరిగాడు.

అక్కడ చాలా తుపాకులు గుట్టగా పోసివున్నాయి. సంచుల్లో నిండుగా బుల్లెట్సు బయటికి తొంగిచూస్తున్నాయి. ఓ పక్కగా పెద్ద గన్నీ బేగ్‌లో నాటు బాంబులున్నాయి. హాలుకి చేర్చివున్న గదివైపు కదిలాడు మహేంద్ర!

చెక్కతో చేయబడ్డ తలుపు. ఆ గదిని హాలునించి వేరు చేస్తోంది.

తలుపు తోశాడు. లోపల ఓ నలభై యేళ్ళ వ్యక్తి పడుకుని నిద్రపోతున్నాడు. అతనికి రెండుపక్కలా అందమైన ఇద్దరు అమ్మాయిలు పూర్తిగా నగ్నంగా వున్నారు. వాళ్ళు కూడా ఒళ్ళు ఎరక్కుండా నిద్రపోతున్నారు. పక్కనే వున్న టీపాయ్‌మీద వేట్ 69 బాటిలు, గ్లాసులు, ఐస్‌క్యూబ్స్ వున్న జగ్‌లు వున్నాయి.

ఆ వ్యక్తిని చూసి ఎక్కడో చూసినట్టుందని కాసేపు గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించాడు మహేంద్ర!

అతనికి వెంటనే తట్టింది—అతను బాస్!

కాని యీ రూపం వేరు, ఎప్పుడూ కనిపించే రూపం వేరు! అతను అందరికీ కనిపించే రూపం కళ్ళకు నల్లటి కళ్ళద్దాలతో, పెద్ద మీసాలతో, మూతి దిగువనుంచి కాళ్ళవరకు వేసుకున్న నల్లటి ముసుగుతో, ఒత్తుగా పెరిగిన జుట్టుతో పొడవుగా కనిపిస్తాడు.

కానీ యిప్పుడు అవేమీ లేవు! కళ్ళకు అద్దాలు లేవు.

దుబ్బు జుట్టు స్థానంలో బట్టతల. జోడి మూతి—మీసా లేవు. మూతి దిగువనుంచి వుండాల్సిన మసుగు మొదలే లేదు. ఆ ఆకారం చాలా పొట్టిగా వుంది! ఒంటిమీద నూలుపోగుకూడా లేదు.

అవన్నీ పక్కనున్న టేబిలుమీద దర్శనమిస్తున్నాయి. అవే పైకి కనిపించేలా లేకుంటే, అతనే బాస్ అని మహేంద్ర ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మేవాడు కాదు!

అయితే ఈ పొట్టి వ్యక్తి....? మహేంద్ర మెదడులో మెరుపులు మెరిశాయి.

అవును! అతనే!....అతనే యీ బాస్!

మహేంద్రకు మంచు తెర విడిపోయింది.

చప్పుడు కాకుండా మెట్లు యెక్కి తను పడుకున్న చోటికి వచ్చాడు. ఎవరూ తనని గమనించలేదని నిర్ధారణ చేసుకున్నాక ఓ పక్కకు తిరిగి నిద్రకుపక్రమించాడు మహేంద్ర.

ఇంతలోనే అతనికేదో తట్టింది. చప్పుడు చెయ్యకుండా మెట్లు దిగాడు. ఇందాకటి హాలు, బాస్ రూం దాటి యింజన్ చప్పుడవుతున్న ప్రదేశానికి మెల్లగా చేరుకున్నాడు.

అది కేబిన్ రూంలా వుంది. దాంట్లో జనరేటర్ పని చేస్తోంది. ఆ సొరంగానికంతటికీ వెలుతురును ఎలక్ట్రానిక్ అపరేటస్ పనిచేయటానికి కావలసిన ఎలక్ట్రిసిటీ అక్కడి నుంచే సప్లై అవుతున్నట్టు గమనించాడు మహేంద్ర.

కేబిన్ రూం పక్కనే మరో ఏంటి రూంలా వున్న గది కనిపించింది. అన్నీ చెక్కలతో కట్టిన గదులే! లోపలికి అడుగుపెట్టిన మహేంద్ర గగుర్పాటుతో ఓ క్షణం అడుగు వెనక్కు వేశాడు.

అక్కడ ఖాకీ పేంట్లు, బనియన్స్‌తో వున్న యిద్దరు యువకులు కాళ్ళు చేతులు ఓ పెద్ద బండకు కట్టబడి నిస్సహాయస్థితిలో శోషవచ్చి పడిపోయినట్టు కనిపిస్తు న్నారు!

నించునే నిద్రపోతున్న ఆ యిద్దరిలో కళాకాంతులు లేక బాగా నీరసంగా నిస్త్రాణగా వున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

ఆ యిద్దరు యెవరో అర్థమైంది మహేంద్రకు. బాస్ చేత బంధింపబడిన పోలీస్ ఇన్స్పెక్టర్లు వాళ్ళు! వాళ్ళని చంపకుండా నే వుంచాడన్నమాట! వాళ్ళద్వారా తమ క్కావలసిన వివరాలు చెప్పించటానికే ప్రాణాలతో వుండనిచ్చాడు బాస్. లేకుంటే, తను దారికి అడ్డొచ్చి నందుకు యెప్పుడో చంపి పాతేసి వుండేవాడు!

మహేంద్ర వెనుతిరిగి మెల్లగా గదులన్నీ దాటు కుంటూ హాలు దగ్గరకొచ్చాడు. హాల్లోని వ్యక్తులు కదలక మెదలక బొమ్మల్లా కుర్చీలకు అతుక్కుపోయి అలాగే వున్నారు.

మెట్లెక్కుతుండగా పై మెట్టు దగ్గర ఎవరో నిల్చుని వుండటం చూసి ఉలిక్కిపడ్డాడు మహేంద్ర.

అతను సారంగం ముఖద్వారం దగ్గర కాపలా వున్న యిద్దరిలో ఒకడు! అతన్ని చూసి మహేంద్ర చిన్నగా నవ్వాడు.

అతను "ఏం మహేంద్రాజీ, యెక్కడ్నుంచి వస్తు న్నారు? ఈ క్రింద బాస్ రహస్య మందిరమనీ, దాని లోపలికి యెవరికీ ప్రవేశంలేదనీ నీకు తెలియదా?" అన్నాడు సీరియస్‌గా.

"తెలుసు, తెలుసు! బాగా దాహమయింది. మంచి

నిళ్ళు దొరుకుతాయేమోనని దిగాను."

"మమ్మల్ని అడిగితే యిచ్చేవాళ్ళం కదా!"

"మీ రెక్కడో సెంట్రీ డ్యూటీమీదున్నారు కదా! పడుకున్న వాళ్ళను లేపటానికిష్టంలేకపోయింది!"

"రండి యిస్తాను" అతను మాట నొక్కి అండర్ గ్రౌండ్ బిలాన్ని మామూలుగా మూసేశాడు.

7

ఉదయమే మహేంద్రను వేన్ మీద జస్వంత్ వుండే స్థావరానికి తీసుకుని బయల్దేరాడు డ్రయివర్. బాస్ అప్పటికింకా లేవలేదుగాని, రాత్రి యిచ్చిన ఆదేశం డ్రైవర్ కి సుగ్రీవాజ్ఞ.

మహేంద్ర యింకా తెల్లవారని గుడ్డి వెలుతురులో హైదరాబాదు నగర వీధుల్ని పరికిస్తున్నాడు. ఊరి పొలిమేరల్లో వున్న బాస్ రహస్య స్థావరంనించి బయల్దేరిన వేన్ నల్లగొండ చౌరస్తామీదుగా విజయవాడ రోడ్ కి తిరిగింది. దిల్ సుక్ నగర్, కొత్తపేట చౌరస్తా దాటి పోయాయి. వరసగా వున్న పౌల్ట్రీఫారంస్ దాటిపోతూ, చివరిగా వున్న ఓ పౌల్ట్రీఫారం ముందాగింది వేన్.

"ఇదే జస్వంత్ స్థావరం! లోపలికి వెళ్ళండి" అన్నాడు వేన్ డ్రయివర్.

"నువ్వూ వస్తావా?" అడిగాడు మహేంద్ర.

"రాకూడదు సార్! బాస్ చెప్పింది మిమ్మల్ని యిక్కడకు చేర్చటంవరకే! లోపల యేం జరుగుతుందో, యెవరున్నారో నేను చూడకూడదు. అది రూలు. రూలు తప్పితే బాస్ ప్రాణాలతో వదలడు."

మహేంద్ర తలూపాడు. వేన్ వెళ్ళిపోయింది.

మహేంద్ర పౌల్ట్రీఫారం లోపలికి అడుగులు వేశాడు.

వరసగా కట్టబడిన వైర్ మెష్ షెడ్డు అంతా కొత్తగా కట్టినట్టు స్పష్టంగా తెలుస్తూనే వుంది!

ఎవరు మనుషులున్న జాడే కనిపించలేదు మహేంద్రకు.

అప్పటికి బాగా వెలుగు వచ్చేసింది. సూర్యకిరణాలు పౌల్ట్రీ షెడ్స్‌మీదపడి మెరుస్తున్నాయి.

మహేంద్ర అడుగులో అడుగు వేసుకుంటూ అటు యిటు చూస్తూ అక్కడే తచ్చాడుతున్నాడు. అక్కడ నాలుగు పౌల్ట్రీ షెడ్స్ తప్ప యింకేం లేవు!

"హల్లో, మహేంద్రాజీ! మీరా? యెవరో అనుకున్నాను" అన్న మాటలు వినిపించి మహేంద్ర చటుక్కున తిరిగిచూశాడు.

ఆ మాటలు తనపక్కగా వున్న షెడ్ నుంచి వస్తున్నట్టు గుర్తించాడు. షెడ్ తలుపులు తెరుచుకుని ఓ నడివయసు వ్యక్తి బయటికొచ్చాడు.

మహేంద్ర వెంటనే అతని వైపు చిరునవ్వుతో అడుగులువేసి "హల్లో జస్వంత్ జీ, నేనే! బాస్ మీ దగ్గరికి పంపించాడు. మీ రెవరూ కనిపించకపోవటంతో నిల్చుని చూస్తున్నాను!" అన్నాడు.

జస్వంత్ ముఖంలో ఏదో అనుమాన వీచిక మెరిసి మాయమయింది.

"మనవాళ్ళెవరూ కనిపించరే, యేమయ్యారు?" అడిగాడు మహేంద్ర.

జస్వంత్ రెండు క్షణాలేవో ఆలోచించి అంతలోనే చిర్నవ్వు నవ్వి, "చెప్పుకోండి చూద్దాం!" అన్నాడు.

మహేంద్ర చుట్టూ కలయజూసి "మీరు వచ్చిన షెడ్‌లోనే ఉండివుంటారు!" అన్నాడు.

జస్వంత్ ముఖంలో ఆశ్చర్యం యీసారి కొట్టొచ్చి

నట్టు కనిపించింది. "ఏరీ? అతన్ని కోల్పే!" అన్నాడు.

మహేంద్ర నవ్వేసి, "చెప్పలేను, మీరే చెప్పెయ్యండి!" అన్నాడు.

జస్వంత్ అందుకు సమాధానమివ్వకుండా, "ఇంత ఉదయాన్నే వచ్చారు, కారణమేమిటి?" అన్నాడు.

"బాస్ మీ దగ్గరకు వెళ్ళమన్నాడు. మీకు ప్రోగ్రాం గురించి తెలుసునని నన్ను ఈ రోజు మీతో కలిసి పని చెయ్యమనీ చెప్పాడు....అన్నట్టు, ఈ రోజు ప్రోగ్రాం యేమిటి? బ్యాంకా, నగల దుకాణమా?" అడిగాడు మహేంద్ర.

జస్వంత్ వెంటనే సమాధానం చెప్పలేదు.

"బాస్ నీతో....అదే, మీతో యేం చెప్పలేదా?"

"లేదు. పోయి మిమ్మల్ని కలుసుకోమన్నారు!"

"నాతో యేం చెప్పలేదే!"

"చెప్పలేదా? చిత్రంగా వుందే! నిన్న రాత్రి నేను బాస్ దగ్గరే వున్నాను. మీకు మెసేజ్ పంపుతానన్నారు. బహుశా వైర్‌లెస్ లోపించి వుండాలి!"

"ఎందుచేతనో మరి, పంపలేదింకా!"

"ఫరవాలేదు, యిప్పుడు బహుశా పంపుతారు. నేనిక్కడ దిగిం తర్వాత డ్రయివర్ వెళ్ళి యిన్ఫర్మేషన్ చెపుతాడు. ఆ తర్వాత మీకు మెసేజ్ పంపవచ్చునని పూరుకుని వుంటాడు బాస్!"

జస్వంత్ జేబులోంచి సిగరెట్ ప్యాకెట్టుతీసి ఓ సిగరెట్ మహేంద్రకు ఆఫర్ చేశాడు.

మహేంద్ర సిగరెట్ తీసి పెదాల మధ్య బిగించాడు. ఇద్దరికీ సిగర్ లైటర్‌తో సిగరెట్లు వెలిగించాడు జస్వంత్.

"నాతో రండి!" అంటూ ముందుకి దారితీశాడు

జస్వంత్. పౌల్ట్రీ షెడ్లకు ఆనుకుని ఆఫీసురూంలా వున్న ఓ గదిలోకి తీసుకు వెళ్ళాడు జస్వంత్—మహేంద్ర అతనితో కలిసి వెళ్ళాడు.

"అనుచరుల గురించి అడిగారు కదూ, రండి చూపిస్తాను!" అన్నాడు జస్వంత్.

మహేంద్ర తక్కిన మూడు షెడ్లకన్న నాలుగో షెడ్డు కొంత విలక్షణంగా వుండటం గుర్తించాడు. నాలుగో షెడ్ కి ఆనుకుని వున్న ఆ రూంకి పక్కనే రెండు గదులున్నాయి. ఆ షెడ్లో కోళ్ళు యేవీ లేవు. మూడు షెడ్లనిండా కోళ్ళు, వాటికి ఆహారం వేయటాని కుపయోగించే పాత్రలు వున్నాయి. నాలుగో షెడ్లో వాటికి వేసే ఆహారం, తౌడు బస్తాలు వున్నాయి.

జస్వంత్ రెండోగది తలుపుమీద మునివేళ్ళతో శబ్దం చేశాడు. తలుపు సగం తెరుచుకుని అందులోనుంచి అయిదుగురు వ్యక్తులు బయటికి వచ్చారు. అందరు పేంట్లు బనియన్లు వేసుకుని వున్నారు. వాళ్ళందరి చేతుల్లోను గన్స్ వున్నాయి.

మహేంద్ర ఆశ్చర్యంగా చూశాడు.

జస్వంత్ చిన్నగా నవ్వి, "ఈయన మన ఫ్రెండ్! నాలాంటి మరో ఏజెంటు! గన్స్ దించండి!" అన్నాడు.

అనుచరులు గన్స్ దించి నేలకి ఆనించి వుంచారు.

"ఈ రాత్రికి ప్రోగ్రాం గురించి అడిగావు కదూ, చెప్పటం మరిచాను. రాత్రి పన్నెండున్నరకు ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ యిల్లు లూటీ చెయ్యబోతున్నాం!"

"ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ యిల్లా? పోలీసు యింట్లో మనకేం దొరుకుతుంది? ధనమా, బంగారమా?"

జస్వంత్ పెద్దగా నవ్వి, "పోలీసుల యింట్లో కోటీ

శ్వరుడి యింట్లో కూడా దొరకని మణులు, మాణిక్యాలు కావల్సినన్ని స్మగుల్డ్ గూడ్సు దొరుకుతాయి——నీకింకా తెలీదేమో!" అని తన జోక్కి తనే మళ్ళీ పడిపడి నవ్వాడు.

మహేంద్ర ఏం మాట్లాడలేదు.

"ఇంకో విషయం కూడా ముందే చెప్పేస్తున్నాను. ఇన్‌స్పెక్టర్ని పై లోకానికి పంపించెయ్యబోతున్నాం!"

మహేంద్ర ముఖంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనిపించింది.

"మన బాస్ యెవర్నీ ఎంతో అవసరమైతే తప్ప చంపవద్దన్నాడు కదా! యింతక్రితం యిన్‌స్పెక్టరని కూడా...." అని నాలుక్కొరుకుతున్నాడు మహేంద్ర.

జస్వంత్ వెంటనే, "అ....యింతక్రితం యిన్‌స్పెక్టరని....ఏం చేశాడు బాస్? చంపేశాడు కదా!" అన్నాడు.

"అదే అంటున్నాను. చంపేశాడని కొందరు చంపలేదని కొందరు మనవాళ్ళే అనుకొంటుంటే విన్నాను. చంపేశారన్నమాట!" అన్నాడు మహేంద్ర తప్పు దిద్దుకుంటూ. తను బాస్ అభ్యంతర మందిరం పక్కనున్న గదిలో యినస్పెక్టరని సజీవంగా చూసిన విషయం బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు.

"బాస్ యింత చిన్న పనికి మిమ్మల్ని కూడా నాకు తోడుపంపించడం దేనికో అర్థం కాకుండా వుంది!" అన్నాడు జస్వంత్.

"నే నింకా యేదో పెద్ద బ్యాంకో, నగల దుకాణమో మరే కోటీశ్వరుడి యిల్లో అనుకున్నాను. ఆఫ్టరాల్ ఓ పోలీసు యినస్పెక్టర్ని చంపడం, యిల్లు లూటీ చెయ్యటం

మనకు మంచినీళ్ళ ప్రాయం!" అన్నాడు మహేంద్ర.

"కమాన్ అండ్ సిట్ డవున్! యూ ఆర్ మై గెస్ట్! యేం తీసుకుంటావు? సారీ, నిన్ను ఏకవచనంలోకి చాలా సార్లు సంబోధిస్తున్నాను. యేమీ అనుకోవటంలేదు కదా మీరు?"

"ఛ, ఛ, మనలో మనకు మన్ననలెందుకు? 'నువ్వు' అని పిలిస్తేనే ఆత్మీయంగా వుంటుంది."

"ఓ..కే! కూచో, యిప్పుడే వస్తాను!" అంటూ పక్క గదిలోకి వెళ్ళాడు జస్వంత్.

8

మహేంద్ర చుట్టూ చురుగ్గా చూశాడు. అనుచరులు కోళ్ళ మేత కలుపుతున్నారు దూరంగా. జస్వంత్ పక్క గదిలోనుంచి వచ్చేలోపల తన పని పూర్తికావాలి.

మహేంద్ర రిస్టువాచీ బటన్ బయటకు లాగాడు. పొడవైన తీగె బయటికొచ్చింది. చకచక మెసేజ్ అందించేశాడు.

"హేండ్సప్ మిష్టర్ కిరణ్!" అన్న మాటలు విని పించి చటుక్కున వెనుతిరిగాడు.

జస్వంత్ చేతిలోని రివాల్వర్ ఆకలిగొన్న పులిలా మహేంద్రవైపు గురిపెట్టబడి వుంది!

మహేంద్ర వాచీ బటన్ మామూలుగా నొక్కేసి "వాట్? కిరణ్ యెవరు? అయామ్ మహేంద్ర!" అన్నాడు.

జస్వంత్ పగలబడి నవ్వాడు.

"నువ్విక్కడికొచ్చిన క్షణమే నువ్వు శత్రువువని గుర్తించాను మిష్టర్ కిరణ్! మంహేంద్రకు నేనిక్క డుంటానో, నా అనుచరులెక్కడుంటారో బాగా తెలుసు!

సరాసరి నా దగ్గరికి వచ్చేవాడు. నీలా దిక్కుదరీ తోచక పెళ్లమధ్యనించుని వెర్రి చూపులు చూసేవాడు కాదు! అప్పుడే నీమీద అనుమానం వచ్చింది.

"నంబర్ టూ! మహేంద్ర నా క్లోజ్ ఫ్రెండు. మేమిద్దరం యేరా అంటే యేరా అనుకుంటాం. అంత క్లోజ్! నువ్వు నన్ను బహువచనంతో సంబోధించటమే కాక, మహేంద్ర మాటని బాగా అనుకరించలేక పోయావు.

"నంబర్ త్రీ! మహేంద్ర ఎట్టి పరిస్థితిల్లోనూ డంకన్ సిగరెట్లు తప్ప మరో బ్రాండ్ తాగడు. నువ్వు నేను ఆఫర్ చేసిన రీజెంట్ ఫిల్టర్ సిగరెట్టు సంకోచంగా తాగావు. అదీగాకుండా నువ్వు రాత్రి ప్రోగ్రాం గురించి యిప్పట్నుంచీ తొందరపడుతున్నావు—రాగానే అదే ప్రశ్న వేశావు. అంటే యిన్ఫర్మేషన్ యెవరికో అందచెయ్యటానికి సిద్ధంగా వున్నావన్నమాట.

"ఈ కారణాలవల్ల నువ్వు మహేంద్రవు కాకపోవటమేగాక, పోలీసువాడివని అనుమానం బలపడింది. అందుకే కావాలని ఇనస్పెక్టర్ శ్రీనివాస్ యిల్లు లూటీ చేసి అతన్ని హతమార్చబోతున్నట్టు చక్కటి అబద్ధం చెప్పాను. నా అనుమానం నిజమయితే, నువ్వు వెంటనే ఆ విషయం యేదో శ్రీనివాస్‌కి అందచేస్తావు. అదేమిటో తెల్సుకోవటంకోసం కావాలని పని కల్పించుకుని పక్కగదిలోకి వెళ్ళాను.

"నా అనుమానం రుజువయింది. నువ్వు నీ ఫ్రెండుకి అప్పుడే అన్ని జాగ్రత్తలు చెపుతూ మెసేజ్ పంపేశావు. నీ నిజస్వరూపాన్ని నువ్వే బయట పెట్టేసుకున్నావు. మహేంద్ర వేషభాషల్ని, రూపురేఖల్ని చాలా చక్కగా

అనుకరించి బాస్‌తో బాటు అందర్నీ బోల్తాకొట్టించావు.

"అయితే బాస్‌కి ఎందుకో నీమీద అనుమానం వచ్చింది. నువ్విక్కడికి రావటానికి అయిదు నిమిషాలక్రితం మెసేజ్ పంపాడు—నిన్నొకకంట కనిపెట్టి వుండమని! రెండుసార్లు మా ప్లాన్స్ ఘోరంగా పరాజయం పొందటానికి నువ్వే కారణమయి వుంటావని కూడా చెప్పాడు. అయితే బాస్ నువ్వే కిరణ్ అని అనుమానించలేదు. మహేంద్రగానే భావించి, నువ్వు యేదో ప్రలోభానికి లోబడి పోలీసులకి మా గుట్టుమట్లు చెపుతున్నావని మాత్రమే అనుమానించాడు.

"కాని నీ ప్రవర్తనలో అన్ని విషయాలు నేను గ్రహించాను. కిరణ్ నువ్వేనని గుర్తుపట్టేశాను!" జస్వంత్ యింకా నవ్వుతూనే వున్నాడు.

మహేంద్ర ఉరఫ్ కిరణ్ చటుక్కున జేబులోకి చేతిని పోనివ్వబోయాడు.

జస్వంత్ గట్టిగా అరిచి చెప్పాడు. "మిష్టర్ కిరణ్, తెలివితక్కువ పనులు చెయ్యవని నా నమ్మకం! మర్యాదగా చేతులు పైకెత్తి ఆ గోడ పక్కగా నించో!" రివాల్వర్ మరింత కావన్‌గా పట్టుకుని అన్నాడు.

డిటెక్టివ్ కిరణ్ చేతులు పైకెత్తి జస్వంత్ చెప్పినట్టే చేశాడు.

జస్వంత్ కిరణ్‌ని సమీపించి, "ప్లీజ్ ఆ వాచీ యిలా యిచ్చెయ్యి!" అన్నాడు.

కిరణ్ మారుమాట్లాడకుండా వాచీ తీసి జస్వంత్ కందించాడు. అందిస్తూ అతను బటన్ మీద మెల్లగా ఒత్తడం జస్వంత్ గమనించలేదు!

"మిష్టర్ కిరణ్, మమ్మల్ని బోల్తా కొట్టించాలని

కావాలనే నువ్వు యేదో పనిమీద ఢిల్లీ వెళుతున్నట్టు నాటకమాడావు. నువ్వు, శ్రీనివాస్ మాట్లాడుకున్న విషయాలు మా బాస్ విన్నాడు. అయితే ఆ తర్వాత నువ్వు బేగంపేట్ విమానాశ్రయంవరకు వెళ్ళటం మా అనుచరులు చూశారు. విమానం యెక్కటం కూడా చూశారు. నువ్వు నిజంగానే ఢిల్లీ వెళ్ళిపోయావనే అనుకున్నారు.

"మహేంద్ర బంధింపబడ్డాక నువ్వు మహేంద్ర వేషంలో తప్పించుకు పోయినట్టు నాటకం ప్రారంభించావు. మా బాస్ నమ్మాడు, ప్రకాష్ కూడా నమ్మాడు. ప్రకాష్‌తో కలిసి చున్నీలాల్ షాపు లూటీ చెయ్యబోతున్న విషయం శ్రీనివాస్‌కి మెసేజ్ పంపి వుంటావు. నువ్వు మాత్రం తెలివిగా తప్పించుకుని పోయావు. నిన్ను కైలాష్ కొంబడించటం కూడా నాటకంలో ఓ భాగమే! అవునా?" అన్నాడు జస్వంత్ నవ్వుతూ.

కిరణ్ నవ్వి, "నువ్వు చాలా తెలివైనవాడివని ఒప్పుకుంటున్నాను. నీకీ విషయాలన్నీ యెలా తెలుసు?" అన్నాడు.

"నువ్వు ఇనస్పెక్టర్ దర్శిని సజీవంగా చూసి వుండి వుంటావని కూడా నాకు తెలుసు అవునా?"

కిరణ్ తలూపి, "అవును. తెలుసుకున్నాను" అన్నాడు.

"అక్కడే హాల్లోవున్న ఎలక్ట్రానిక్ పరికరాలు, వైర్‌లెస్, టెలివిజన్ సెట్లుకూడా చూశావుకదా! వాటిద్వారా యివన్నీ, బాస్‌కి ఎప్పటికప్పుడు తెలుస్తూనే వున్నాయి. ఆ విషయాలు ఎప్పటికప్పుడు ఆయన తెలియజేస్తూవచ్చాడు!"

కిరణ్ తలూపి, "ఇదంతా చాలా ప్లాన్డ్‌గా జరిగిందన్నమాట! మీరందరు యిక్కడ వివిధ వృత్తులు చేపట్టిన వ్యక్తుల్లాగా చక్కగా అమరిపోయారంటే, మీకు ఇక్కడ స్థానికంగా కొంతమంది వ్యక్తులు బాగా సాయపడుతున్నారని నాకు అరథమైంది!" అన్నాడు.

జస్వంత్, "చివరిసారిగా నీ దేవుడ్ని తలుచుకో!" నిన్ను వెంటనే చంపెయ్యమని బాస్ ఆర్డరు. యిప్పటిదాకా నీతో వాదన వేసుకోవటం ఆయనకు తెలిస్తే నన్ను చంపుతాడు! ఇదివరలో పోలీసువాళ్ళని చంపవద్దనేవాడు, కాని నీ సంగతి యింతక్రితమే నేను వైర్‌లెస్‌లో చెప్పగానే వెంటనే ప్రాణాలు తీసెయ్యమన్నాడు. నువ్వు బతికుంటే యింకా చాలా ఘోరాలు జరిగిపోతాయని ఆయనకు తెలుసు!" అన్నాడు. అతని వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకోవటం కిరణ్‌కి స్పష్టంగా కనిపిస్తోంది.

"ఒక్క మాట! మీ బాస్ ఎవరు? అతని పేరేమిటి? ఇదొక్కటి చెప్పి నన్ను చంపెయ్యి!" అన్నాడు కిరణ్.

జస్వంత్ పెద్దగా నవ్వి "చావబోయే వాడివి నీకెందుకంత యింట్రెస్టు?" అన్నాడు.

"ఊరకే తెల్సుకుని చద్దామని!"

"చెప్పను, చెప్పకూడదు! మేము ఎంత డెకాయిట్స్ అయినా మాకుందే నీతి మాకూ వుంది! ఎవరికీ యెట్టి పరిస్థితుల్లోనూ చెప్పమని రక్తప్రమాణం చేశాం!" జస్వంత్ చేతిలోని రివాల్వర్ మరుక్షణం గర్జించి వుండేదే! అతని రివాల్వర్‌లోని బుల్లెట్ కిరణ్ నెత్తురు రుచిమాచి వుండేదే!

కాని కిరణ్ కాళ్ళతో చిన్న అద్భుతం సృష్టించాడు.

అతని షూ కింద అమర్చబడిన సాకెట్ నుంచి ఒక్క సారిగా విపరీతమైన గ్యాస్ బయటికొచ్చింది.

జస్వంత్ ఉక్కిరి బిక్కిరై పోయాడు. ఆ ఒక్క క్షణాన్ని సద్వినియోగం చేసుకున్నాడు కిరణ్. కోటు జేబునుంచి రివాల్వర్ తీసి అంత చురుగ్గాను జస్వంత్ చేతికి గురిచూసి కాల్చాడు.

సైలెన్సర్ అమర్చిన రివాల్వర్ అది! గుండు సఁయ్ మంటూ పోయి జస్వంత్ చేతిని గాయపరిచింది. అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి అవతలపడింది.

అయితే అప్పటికే అనుచరులు అయిదుగురు గన్స్‌తో గదిలోకి పరుగెత్తుకుని వచ్చారు.

కిరణ్ అప్పటికే జస్వంత్ దగ్గరికి చేరుకుని అతని కణతకు రివాల్వర్ గురిచేసి పట్టుకున్నాడు. ఎడమచేత్తో జస్వంత్‌ను ఒడిసిపట్టుకుని, "నీ అనుచరులు ఏమాత్రం తొందరపడినా నిన్ను చంపి మరీ చస్తాను, అది గుర్తుంచుకో!" అన్నాడు.

జస్వంత్ తనవాళ్ళకు సైగ చేశాడు. వాళ్ళు కోపంగా చూశారు జస్వంత్ వైపు "నువ్వు నీ ప్రాణంకోసం చూసుకుంటున్నావా? బాస్ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మేము నీ మాట వినకూడదనుకుంటున్నాం!" అన్నాడు అందులో ఒక అనుచరుడు.

కిరణ్ ప్రమాదాన్ని గుర్తించి, అనుచరుల్ని గురిచూసి కాల్చాడు. ఇద్దరు నేలకూలారు. తక్కిన ముగ్గురు గన్స్ చేతుల్లో పొజిషన్ చూసుకుని కాల్చేలోపల కిరణ్ జస్వంత్‌ని అమాంతం పైకెత్తి వాళ్ళమీదకు విసిరేశాడు. నలుగురు నేలబారుగా పడిపోయారు.

సరిగ్గా అదే సమయంలో బయటనుంచి బూట్ల చప్పుడు. శ్రీనివాస్, కైలాష్, పోలీసుల్తో పరుగున లోనికొచ్చారు.

అనుచరులకి కాల్చటానికి అవకాశ మివ్వకుండానే పోలీసులు వాళ్ళని కస్టడీలోకి తీసుకున్నారు.

కిరణ్ వంక ఆత్రంగా చూస్తున్నాడు శ్రీనివాస్.

"ఏదో ప్రమాదం జరిగిందనటానికి సూచనగా అలారం వినిపించింది. వెంటనే నువ్వు ముందు మెసేజ్‌లో చెప్పిన వివరాలను గుర్తుపెట్టుకుని పరుగెత్తుకొచ్చాం!" అన్నాడు.

"గుడ్! చివరి ఛాన్సుగా వాచ్ బటన్ ఒత్తి మరీ దాన్ని జస్వంత్‌కిచ్చేశాను. మిస్టర్ జస్వంత్ నా వాచీ తీసుకుంటున్నాను!" అంటూ అతని పేంటు జేబునుంచి తన వాచీ స్వాధీనం చేసుకున్నాడు కిరణ్.

జస్వంత్ కొరకొరా చూస్తున్నాడు కిరణ్ వంక.

"నువ్వు నాతో యెందుకు సంభాషణ పెంచుతూ తాత్సారం చేశావో యిప్పుడర్థమయింది నాకు! నువ్వే డిటెక్టివ్ కిరణ్‌వని గుర్తించగలిగిన మేధావిని నీ చేతిలో ఓడిపోయాను!" అన్నాడు.

కిరణ్ నవ్వి, "నువ్వు తెలివైన వాడివని నేను ఒప్పుకున్నాను కదా! కాని తక్కిన వాళ్ళకన్న నువ్వు సెన్సిటివ్! యేదో మూల నీకింకా మానవత్వం మిగిలిపోయింది. అందుకే నన్ను మీ బాస్ చంపేయమని వెంటనే చెప్పినా కొంత టైమిచ్చావు!" అన్నాడు అతని భుజం తట్టి.

తర్వాత శ్రీనివాస్ వైపు తిరిగి, "వీళ్ళను కైలాష్‌కి అప్పచెప్పు. మనం చాలా అర్జంటుగా వెళ్ళాలి!" అంటూ

బయటికి పరుగులాంటి నడకతో చకచక అంగలువేశాడు కిరణ్.

శ్రీనివాస్ అనుసరించాడు.

జీప్ ఎక్కబోతూ, "మిస్టర్ కైలాష్! ఇక్కడి అణు వణువూ బాగా పరీక్షించి ఆయుధాలు స్వాధీనం చేసుకో! నా అనుమానమే నిజమయితే ఆ షెడ్‌లో వున్న తవుడు బస్తాల్లోకూడా ఆయుధాలు, నాటు బాంబులు, ట్రాన్స్ ఫార్మర్లవంటి ఎలక్ట్రానిక్ సాధనాలు దొరకొచ్చు. జస్వంత్ ఓ పట్టాన చెప్పడు. అయినా వీ కాషస్!" అన్నాడు కిరణ్.

జీప్ నాచారం గోడ్డువెళ్ళ దూసుకుపోయింది.

9

ఎదురుగుండా నల్లటి బొగ్గులా వున్న ఆ కొండ ప్రాంతాన్ని బయట్నుంచి చూస్తూనే శిలలా నిలబడి పోయాడు కిరణ్. శ్రీనివాస్ అతనివంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఏమిటి బ్రదర్, యేమయింది?" అనడిగాడు.

"షో కాల్డ్ బాస్ తన సాథరాన్ని ధ్వంసం చేసేసి యిక్కడ్నుంచి పారిపోయాడు. నా తాత్సారంవల్ల మన ఇనస్పెక్టరిద్దరు ప్రాణాలు కోల్పోయారు!" అన్నాడు కిరణ్ విచారంగా.

శ్రీనివాస్ హేట్ తీసి చేత్తో పట్టుకున్నాడు.

"అయితే బాస్‌తోబాటు తక్కిన అనుచరులు కూడా తప్పించుకుపోయారంటావా?" అడిగాడు.

"ఏం చెప్పగలం? తన ఆధారాలేవీ దొరక్కుండా ఈ సాథరాన్ని మందుగుండుతో పేల్చేసి వుంటాడు. ఫూరికి చాలా దూరంలో వుండటంవల్ల నెవరికీ యీ

విషయం పట్టలేదు! బహుశా మనం జస్వంత్ ని వశం చేసు కోవటం బాస్ టి.వి. స్క్రీన్ మీద స్పష్టంగా కనిపించి వుంటుంది. తర్వాత మనం ఎలాగూ యిక్కడికే వస్తామని అతనికి తెలుసు! అందుకే ఈ సౌవరాన్ని నామురూపాలు లేకుండా చేసి వుంటాడు!" అన్నాడు కిరణ్.

రోడ్డున అప్పుడొకటి, అప్పుడొకటి వాహనాలు వస్తూ పోతున్నాయి. కాని యేం పట్టనట్టు మామూలుగా, చాలా సహజంగా యెవరి మటుకు వాళ్ళు వాహనాలు ఆపకుండానే పోతున్నారు.

కిరణ్ శ్రీనివాస్ వంక చూసి, "బాంబులుపడి పెద్ద ప్రళయం వచ్చినా ఈ హైదరాబాదు వాసులు పక్కనేం జరుగుతున్నదో పట్టించుకోరనటానికి ఈ సౌవరం వద్ద జరిగిన ప్రేలుడే నిదర్శనం! యెక్కడికక్కడ రాళ్ళు కూడా లేచిపోయేటంత పెద్ద పేలుడు సంభవించి వుండాలి! అయినా ఎవరూ దీన్ని గుర్తించలేనంత బిజీ జీవితమైపోయింది!" అన్నాడు.

శ్రీనివాస్, "సిటీకి యిరవై కిలోమీటర్ల దూరంలో జరిగింది పేలుడు! ఎక్కువమందికి వినిపించే అవకాశం లేదులే!" అన్నాడు.

కిరణ్ మస్తిష్కంలో మెరుపులు మెరిశాయి!

"మిస్టర్ శ్రీనివాస్! ఆ బాస్ ఎవరో నాకు చూచాయగా తెలిసింది. మనకి వెంటనే మూడు నెలల క్రితం న్యూస్ పేపర్స్ కావాలి! అందులో ఈ బాస్ గురించిన వివరాలు దొరుకుతాయి!" అన్నాడు.

శ్రీనివాస్ ఆశ్చర్యంతో చూశాడు.

"కమాన్, ఆ పేపరు మా యింట్లో దొరుకుతుంది. సరాసరి మా ఇంటికి పోదాం!" అన్నాడు కిరణ్ ఒక్క

గొంతులో జీప్‌లోకి ఉరుకుతూ.

జీపు 'శ్రీ సదనం' వైపు దూసుకుపోయింది.

అరగంట తర్వాత—

కిరణ్ న్యూస్ పేపరు ముందేసుకుని, "ఇతని పేరు జె. సంతానగోపాలం. ఎలక్ట్రానిక్ యింజనీర్. నంబరు అరవై రెండూ బై ముప్ఫైమూడు యింజనీర్స్ కాలనీ!" అని చదివాడు.

శ్రీనివాస్ ప్రశ్నార్థకంగా చూశాడు. "ఇతన్ని కొత్త ప్రభుత్వం అవినీతి ఆరోపణలమీద ఉద్యోగం నించి తొలగించింది. ఇతని అడ్రసు మనకెందుకు?" అన్నాడు.

"ఎందుకా? ఇతనే యిన్ని ఘాతుకాలకు కారణ మయిన ఆ 'బాస్'! ఇతని నిజస్వరూపం నేను కళ్లారా చూశాను. అతన్ని చూడగానే ఎక్కడో చూసినట్టు అనిపించింది. అప్పుడే అతని గురించిన జ్ఞాపకాలు నా మెదడులో రికలెక్ట్ అయాయి! వెంటనే యీ నెంబరు యింటికి సిబ్బందితో వెళ్ళి యీ దేశంనుంచి సంతాన గోపాలం పారిపోయేలోపల స్వాధీనం చేసుకో!" అన్నాడు కిరణ్.

• • •

ఫోన్ గణగణ మోగటంతో రిసీవర్ ఎత్తి "హల్లో!" అన్నాడు కిరణ్ పక్కమీదనుంచే.

అవతలనుంచి శ్రీనివాస్ మాట్లాడుతున్నాడు.

"సుప్రభాతం బ్రదర్! సంతానగోపాలం, తన ఫాలోయిర్స్‌తోబాటు దొరికిపోయాడు. జరిగిన అన్ని దోపిడీలకు తనే కారకుడనని అంగీకరించాడు. లతీఫ్ అనబడే అతని ఆఖరి యేజెంటు కూడా సరెండరయి

పోయాడు. ఉద్యోగం పోయిన తర్వాత అక్రమ సంపాదనకు అలవాటైన సంతానగోపాలం, అప్పటికే చిన్న చిన్న దోపిడీలు చేస్తున్న జస్వంత్, లతీఫ్‌ని, మహేంద్రను, ప్రకాష్‌ని సమీకరించుకుని డెకాయిటిమ్స్‌కి ఆధిపత్యం వహించాడు.... థాంక్స్‌లాట్ బ్రదర్! నీ ప్రాణాలకు తెగించి, యీ విజయం సాధించినందుకు మన హోమ్ మినిష్టర్, కమిషనర్, డి.జి.పి. నిన్ను...." అంటూ శ్రీనివాస్ దండకం చదువుతుండగానే నవ్వుతూ ఫోన్ పెట్టేశాడు కిరణ్.

—: సమాప్తం :—